క్లుప్తంగా

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. జిల్లాలో 26 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు ముందుగానే ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

మదనపల్లె సిటీ: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వన్‌డిపోలోని గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లతో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కల్పించారు. డ్రైవర్లు, కండక్టర్లు కెఎంపీఎల్,ఈపీకె పెంచాలన్నారు. డిపోను రీజియన్ పరిధిలో మొదటి స్థానం నిలపాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

మదనపల్లె సిటీ: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని మదనపల్లెలో శుక్రవారం మదనపల్లె పట్టణంలో బీజేపీ నాయకులు అక్షింతలు పంపిణీ చేపట్టారు. పట్టణంలోని అప్పారావువీధి, దేవళంవీధి, నెహ్రూబజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందజేశారు. 22న స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలోఒ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ పార్లమెంటరీ కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణుగోపాల్, పూల నాగరాజు, కృష్ణమూర్తి, రవికుమార్,భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

మదనపల్లె : పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న న్యాయవాది భరత్‌భూషణ్(50)కు గురువారం రాత్రి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించేలోపు కన్నుమూశారు. న్యాయవాది భరత్‌భూషణ్ ఆకస్మిక మృతిపై మదనపల్లె బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కుటుంబ సభ్యులను ఓదార్చారు. న్యావాది మృతికి సంతాం తెలిపారు.

సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

కలకడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి, ఉత్తమ సేవలకు మార్గాలను చూపడమే విక్షిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోన పంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ పనిముట్లు, పరిశ్రమలు, బీమా, ఆర్థిక ప్రగతికి సోపానాలు అన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని, యువత ఉపాధి పొందాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి మునిరాజ, వీఆర్‌ఓ రిచంద్రన్, నాయకులు శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హరినాథరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ ఇన్స్‌పెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న దాత రెడ్డిశేఖర్‌రెడ్డి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి మదనపల్లె రూరల్ మండలం సీటీఎంకు చెందిన చింతల రెడ్డిశేఖర్‌రెడ్డి రూ.55 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయఅధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దాత రెడ్డిశేఖర్‌రెడ్డి చెక్కును ఆలయ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణకు అందజేశారు. రెడ్డెమ్మకొండ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజుల దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మండల విజేతగా కలికిరి–4 టీం

కలికిరి: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ మండల స్థాయి పోటీలలో కలికిరి–4 సచివాలయ టీం విజేతగా నిలిచింది. శుక్రవారం కలికిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఫైనల్‌లో మండలంలోని పల్లవోలు, కలికిరి–4 సచివాలయ పరిధిలోని టీంలు పోటీపడగా ముందుగా బ్యాటింగ్ చేసిన పల్లవోలు టీఎం 10 ఓవర్లకు 79 అడుగులు చేయగా కలికిరి–4 టీఎం ఇంకా మూడు బాల్‌లు మిగిలిఉండగానే లక్ష్యం 80 పరుగులు పూర్తి చేసి విజేతగా నిలిచింది. విజేత టీంకు ఎంపీడీఓ గంగయ్య, స్థానిక సర్పంచ్ ప్రతాప్ రెడ్డి చేతులమీదుగా క్రికెట్ కిట్‌ను అందజేశారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

● వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మదనపల్లె : మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



తంబళ్లపల్లె: మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

మదనపల్లె : ప్రజలందరికీ ఆరోగ్యం అందించే మంచి లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కురవంక పంచాయతీలో సర్పంచ్ చిప్పిలి చలపతి అధ్యక్షతన జరుగుతున్న రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిసార్‌అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కుగా, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. ఆరోగ్యం సరిగా లేని పేద ప్రజలు నాణ్యమైన మంచి వైద్యం చేయించుకునేందుకు ఖర్చుకు భయపడి ముందుకురావడం లేదన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధికంగా డబ్బు ఖర్చు చేసుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటన్నంటినీ గమనించిన జగనన్న ప్రజల చెంతకే వైద్యం అందేలా ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అపర సంజీవనిలా నిలిచిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను మరింత విస్తృతం చేసి వైద్యపరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చూస్తున్నారన్నారు. కంటివెలుగు పథకం కింద కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయించడం, కళ్లజోళ్ల పంపిణీ చేస్తున్నారన్నారు. థలసేమియా, పక్షవాతం, కిడ్నీ, గుండె, లివర్ తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి రూ.5వేల నుంచి 10వేల వరకు పింఛన్ సాయంగా అందిస్తున్నారన్నారు. ప్రజారోగ్యమే పరమావధిగా, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తున్న జగనన్నను ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకువచ్చి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, చిప్పిలియూత్ శశికుమార్, క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షులు బోనాసి జాన్ బాబు, బుల్లెట్‌షఫీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యం కోసమే ఆరోగ్య శిబిరాలు



వాల్మీకిపురం: ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ లోకవర్ధన్

వాల్మీకిపురం: పేద ప్రజల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మూరేవాండ్లపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ముందస్తు ఇంటింటి సర్వే పూర్తి చేసి టోకెన్ అందజేసి క్యాంప్‌లకు హాజరయ్యే విధంగా వలంటీర్లు, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు, సిహెచ్‌వోలు కృషి చేయాలన్నారు. అనంతరం 196 మందికి చికిత్సలు నిర్వహించి, వారి వివరాలను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, 4 మందిని ఉన్నత చికిత్సలకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసీమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరుగైన వైద్యసేవలకే ఆరోగ్య సురక్ష

తంబళ్లపల్లె: గ్రామీణప్రాంత ప్రజలకు పల్లెల్లోనే మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా డీఎంహెచ్‌ఓ కొండయ్య తెలిపారు. శుక్రవారం కుక్కరాజుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు సకాలంలో వైద్యసేవలు అందించి ఆరోగ్యం కాపాడాలన్నదే సీయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. నాడు–నేడు తో ఆసుపత్రుల అభివృద్ధి, 104,108, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైద్యులు ఆశాలత, తేజశ్విలు రోగులకు వైద్యచికిత్సలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్యసేవలు

పెద్దమండ్యం: గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజల వద్దకు ప్రభుత్వం వైద్యసేవలను తీసుకొచ్చినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని శిద్దవరం పంచాయతీ కోటగుట్టపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రజలకు వివిధరకాల సేవలతో బాటు, వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాంప్‌కు వచ్చిన రోగులకు డాక్టర్‌లు చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌వో క్రిష్ణయ్య, సర్పంచ్ విజయకుమారి, డాక్టర్‌లు ఇమ్మాన్యుల్, హరివర్మ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మస్తాన్‌వల్లి దర్గాలో ప్రార్థనలు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని మస్తాన్‌వల్లి దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. దర్గాలో పూలచాదర్ సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దువా చేశారు.కార్యక్రమంలో ఇర్ఫాన్‌ఖాన్, ఫిర్దౌస్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బి.కొత్తకోట: మండలంలోని నాయనబావి, బడికాయలపల్లె, బి.కొత్తకోట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గిరిధర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీలేరు ఈఓగా గఫూర్



ఈఓను సత్కరిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ ఈఓగా ఎస్.ఎ. గఫూర్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఈఓగా పని చేస్తున్న రెడ్డిప్రసాద్‌రెడ్డి బదిలీపై వాల్మీకిపురం వెళ్లారు. కేవీపల్లెలో ఈవోపీఆర్‌డీగా పని చేస్తున్న పీలేరు ఈఓ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సర్పంచ్ జీనత్‌షఫీ, పంచాయతీ సిబ్బంది స్వాగతం పలికారు. నూతన ఈఓ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు.

అన్ని వర్గాల ఆత్మగౌరవ చైతన్యదీపిక అంబేడ్కర్



పీలేరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పెద్దతిప్పసముద్రం : గజమాలతో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పీలేరు : అన్ని వర్గాల ఆత్మగౌరవ చైతన్యదీపిక డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పీలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే విజయవాడలో దేశానికే తలమానికంగా భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిపై కూడా ప్రతిపక్ష నేత చంద్రబాబు బురదజల్లే వాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల ఓర్వలేక పచ్చపత్రికల్లో విషపురాతలు రేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గూర్చి పట్టించుకోని చంద్రబాబు దళితద్రోహిగా మిగిలిపోయారని విమర్శించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీలేరు పట్టణంలోని సైనిక్ నగర్, యల్లమంద క్రాస్, కడప రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అందించిన పథకాలు చదివి వినిపించడం తోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో వందశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం చెందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసినట్లు తెలిపారు. క్యాక్రమంలో జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్ జీనత్‌షఫీ, దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్.వి. చలపతి, ఉదయ్‌కుమార్, సునీల్ రెడ్డి, షాకీర్, స్టాంపుల నరసింహారెడ్డి, మహితాఆనంద్, నాగభూషణం, కంభం భాస్కర్‌రెడ్డి, చక్రధర్, అరుణ, షపూరా, తదితరులు పాల్గొన్నారు.

గజమాలతో అంబేడ్కర్‌కు నివాళి

పెద్దతిప్పసముద్రం: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగనన్న పాలన సాగుతోందని ఎంపీపీ మహమూద్, స్థానిక సర్పంచ్ తమక శంకర్, సచివాలయ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. విజయవాడలో శుక్రవారం ప్రారంభం చేస్తున్న అంబేడ్కర్ భారీ విగ్రహ ఆవిష్కరణకు సంఘీభావంగా సర్పంచ్ ఆద్వర్యంలో మండల కేంద్రంలోని విగ్రహానికి గజమాలతో ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, కోఆప్షన్ ఖాదర్‌వలి, నాయకులు ఉత్తన్న, భాస్కర్‌నాయుడు, జయచంద్రారెడ్డి, సాదిక్ బాషా, మహబూబ్‌బాషా, దీపాల వెంకట్రమణ, దండి శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు సహకరించాలి



కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

మదనపల్లె : మండలంలోని అన్ని పంచాయతీల్లో కులగణన సర్వేలో భాగంగా వివరాలు సేకరించే సిబ్బందికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామసచివాలయాల పరిధిలో కులగణన ప్రారంభించారు. మొదట పంచాయతీలోని గ్రామసర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్స్ ఇళ్ల నుంచి సర్వే మొదలుపెట్టారు. కురవంకలో జరుగుతున్న కులగణన ప్రక్రియలో ఎంపీడీఓ భానుప్రసాద్, ఆర్ఐ రెడ్డెప్ప, ఏఎస్ఓ సురేష్ పరిశీలించారు. క్యాస్ట్ సర్వేలో ఇబ్బందులు, సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానుప్రసాద్ మాట్లాడుతూ...కులాల వారీ జనాభా, వారి ప్రస్తుత సామాజిక విద్య, ఆర్థిక పురోభివృద్ధి తెలుసుకోవడానికి సముచిత విధాన నిర్ణయాలు చేపట్టేందుకు వీలుగా కులగణన ప్రక్రియకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు దాదాపు 10 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి కులగణన వివరాలు సేకరిస్తామన్నారు. అనంతరం 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వేలో మిగిలిపోయిన కుటుంబాలను గుర్తించి, వివరాలు నమోదుచేస్తామన్నారు. ఫిబ్రవరి15 వరకు సచివాలయ స్థాయిలో డేటా క్రోడీకరణ, ఇతర ప్రక్రియలు నిర్వహిస్తామన్నారు. కులగణన ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్‌యాప్‌ను సిద్ధం చేసిందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక మొబైల్ యాప్ సహాయంతో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. కులగణన ప్రక్రియలో అత్యంత పారదర్శకంగా వివరాల నమోదు అనంతరం ఆ కుటుంబంలో ఎవరైనా ఒక వ్యక్తి నుంచి ఆధార్‌తో కూడిన ఈ–కేవైసీ తీసుకోనున్నట్లు తెలిపారు. మొదటిరోజు మండలంలోని అన్ని పంచాయతీల్లో 500 కుటుంబాల వరకు క్యాస్ట్ సర్వే పూర్తిచేశామని, మిగిలిన 9 రోజులు జరగనున్న సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కులగణన సక్రమంగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: మండలంలో శుక్రవారం నుంచి చేపట్టిన కులగణన సర్వేను పకబ్బందీగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. కుక్కరాజుపల్లెలో జరుగుతున్న కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లసహకారంతో ఇంటింటికీ వెళ్లి కులగణన యాప్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు.

సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



సబ్ కలెక్టరేట్‌లో జ్ఞాపికను అందిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకుని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి పేర్కొన్నారు. శుక్రవారం సబ్ కలెక్టరేట్‌లో...ఈనెల 12న పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల విజయవంతానికి కృషిచేసిన పలువురిని ఆర్డీఓ అభినందించారు. సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి సంబరాలు నిర్వహిద్దామని పిలుపునిచ్చిన వెంటనే.. స్వచ్ఛందంగా తరలివచ్చి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ప్రతి ఏడాది ఇలాగే సంబరాలు నిర్వహించేలా, పట్టణ ప్రజలందరినీ భాగస్వామ్యులు చేసేలా చూడాలన్నారు. పండుగలు, ఆచార వ్యవహారాలు అందరివని, స్నేహపూర్వక వాతావరణంలో, సోదరభావంతో సంక్రాంతి సంబరాలు విజయవంతం చేసినందుకు అభినందించారు. అలాగే 22వతేదీ అయోధ్యలో శ్రీరామ విగ్రహావిష్కరణ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమాల్లోనూ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ గ్రాండ్స్ సుధాకరరెడ్డి, శేఖర్‌స్వీట్స్ ముత్తుస్వామి, కే.జే.మండీ దాదాపీర్, ఎంవీఐ శివలింగయ్య, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బాలగంగాధరరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ పోతబోలురెడ్డెప్ప, వెలుగుభాగ్యలక్ష్మి, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఆదిత్య రామలింగారెడ్డి, కమాల్‌బాషా, మిమిక్రీ కరుణాకర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

పీలేరు రూరల్ : ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలు నడపాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్రాస్ రోడ్డులో వాహన చోదకులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, డ్రైవర్లు నియమాలు పాటించి వాహనాలు వేగం తగ్గించి నడపాలని సూచించారు. ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నరసింహుడు, రమణ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

పెద్దతిప్పసముద్రం: పూర్వీకుల నుంచి సంక్రమించిన తమ భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ వంశపార్యపరంగా సంక్రమించిన 43 సర్వే నంబర్లలోని భూముల్లో తాము 34వ భూ భాగస్థులమని, ఇంత వరకు మాకు ఎలాంటి పట్టాదార్ పాసు పుస్తకాలు మంజూరు కాలేదని రైతులు శివరాంరెడ్డి, వెంకట్రమణారెడ్డి, బొంతల హరిబాబు, కనకమ్మ, వెంకట్రమణప్పలు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కూడా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయంపై తహశీల్దార్ విద్యాసాగర్ మాట్లాడుతూ వివాదాస్పదంగా ఉన్న సెటిల్‌మెంట్ భూమిలో భాగస్థులు అధికంగా ఉన్నారని, రీ సర్వే సమయంలో కూడా సదరు భాగస్థుల నడుమ ఐక్యత లేకపోవడంతో అధికారుల సమక్షంలోనే ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. ఆందోళన చేస్తున్న రైతులు అధికారులపై చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. అనంతరం ఆందోళనకారులతో మాట్లాడుతూ ఎవరికి ఎంత భూమి ఉంది, రికార్డుల్లో ఎవరి పేర్లు ఉన్నాయి, భూములు ఎవరి అనుభవంలో ఉన్నాయి, నిజమైన హక్కుదారులెవరు అనే వివరాలపై సమగ్రంగా ఆరా తీసి రికార్డుల ప్రకారం న్యాయం చేస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు.

ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా మలేరియ నివారణాధికి డాక్టర్ బి.వేణుగోపాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో పీహెచ్‌సీ, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు కలిసి వారంలో ఒక రోజు ఫ్రై డేను డ్రై డేగా గుర్తించే విదంగా అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలో మందుల నిల్వ, సీజనల్‌వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సి పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లెలో ఇంటింటిని సందర్శించి నీటి నిల్వ లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. చెత్త నిల్వ లేకుండా చేయడం, దోమల నివారణకు సాయంత్రం సమయంలో నిప్పు పెట్టడం, దోమతెరల వినియోగం వంటివి ప్రతి ఇంటికి తెలియజేయాలని సూచించారు. కీటక జనిత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో మలేరియ సబ్‌యూనిట్ అధికారి ముజీబ్‌బాష, డాక్టర్ జవహర్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్, రెడ్డెమ్మ, సిబ్బంది భారతమ్మ, జమీల్‌అహమ్మద్ పాల్గొన్నారు.

ఉచిత ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న దృశ్యం

కలకడ : ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఉచిత ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, కోన క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కోన జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 8వతరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌ను అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వై.భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు ప్రసంగించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు సరళ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడిసాగులో సస్యరక్షణ చర్యలు

పీలేరు రూరల్ : మామిడి సాగులో సస్యరక్ష చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మత్రిమాకులపల్లెలో మామిడితోటను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ మామిడిలో పూతరాని తోటలలో పూమొగ్గలు ఉత్తేజపరచి పూతరావడానికి, ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ 13.0.45ను 10 గ్రాములు, ఫార్ములా 4 లేదా ఆర్కా మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తేనె మంచు పురుగు, పక్షి కన్ను తెగులు నివారణు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటర్లు + కార్బన్డిజం 1 గ్రాము లేదా నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, వేప నూనె 3 మిల్లీ లీటరు, జిగురుమందు 0.5 మి.లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమండ్యం: పశుబీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ విక్రమ్ రెడ్డి కోరారు. పశుబీమాపై ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చినట్లు శుక్రవారం ఆయన తెలిపారు. పశుబీమా కావాల్సిన పాడి రైతులు 20 శాతం ప్రీమియం చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వం 80 శాతం రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. పశువులకు పశు భీమా ప్రీమీయం చెల్లిస్తే మూడు సంవత్సరాల వరకు ఇన్సూరెన్స్ పొందవచ్చని తెలిపారు. రూ.30 వెల బీమాకు రైతు తమ వాటాగా రూ. 400, రూ. 50 వేల బీమాకు రైతు తమ వాటాగా రూ. 1700 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు పశువైద్య సహాకున్ని సంప్రదించాలన్నారు.